కె. రామలక్ష్మి

# కృష్ణార్పణం



# కృష్ణార్పణం

రచన

**కె. రామలక్ష్మి**

ప్రచురణ :

**స్త్రీ శక్తి ప్రచురణలు**

304, శ్రీ సాయి అపార్ట్‌మెంట్స్

ఓల్డు ఆర్.టి.ఎ. రోడ్, ఆస్మాన్‌ఘడ్

న్యూ మలక్‌పేట, హైదరాబాద్–500 036

ఫోన్ : 91-040-24162885

# కృష్ణార్పణం

© కె. రామలక్ష్మి

మొదటి ముద్రణ : 2006

వెల : **రూ. 80/-**

ప్రతులకు :
విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్,
విజ్ఞాన్ భవన్, బ్యాంక్ స్ట్రీట్
హైదరాబాద్ - 500001.

కవర్ డిజైన్
పురుషోత్త్ కుమార్

డి.టి.పి
అనురాధా రఘురామ్
ఫోన్ : 040-27621155

ప్రింటర్స్
గాయత్రి గ్రాఫిక్ పాయింట్
హైదరాబాద్ - 500 044.

# అంకితం

శ్రీకృష్ణ భక్తుడు, మా శ్రేయోభిలాషి
శ్రీ వి.ఎ.కె. రంగారావు కోసం
ఈ చిరు కానుక

**కె. రామలక్ష్మి**
31-8-2006

# కృష్ణార్పణం

సువిశాలమైన రాజవీథిలో వ్రేపల్లె నుంచి వచ్చిన గొల్లలు గుంపులు గుంపులుగా ఆనందోత్సాహాలతో కేరింతలు కొడుతూ సాగుతున్నారు. డప్పులు వాయిస్తూ నాట్యాలు చేస్తున్నారు. చిందులు తొక్కుతున్నారు. ముందుకు సాగుతున్నారు. అందరి చేతుల్లోనూ చేపాటి కర్రలు. వాటి ఇత్తడి కట్లు ఆ లేత ఎండలో బంగారపు కాంతులీనుతున్నాయి. కొందరు కావిళ్లు మోస్తూ నడుస్తున్నారు. వారి నడక తీరుకు కావిళ్లు వింత వింత హొయలు పోతున్నాయి. అందరి ముఖాలూ ఆనందంతో వెలిగిపోతున్నాయి.

రాజవీథిన సాగే జనం ఆగిపోయి యీ వింత యాత్రని అబ్బురంగా చూస్తున్నారు. “ఎందుకింత ఆనందం యీ గొల్లలకి, దేనికింత ఉత్సాహం వారిని ఉరకలు వేయిస్తూంది?” అందరి నోటా యిదే మాట.

యాదవబృందం ఆడుతూ పాడుతూ రాజభవనంకేసి సాగింది. సింహద్వారం ముందు నిలబడి దాని ఎత్తుకీ, వెడల్పుకీ ఆశ్చర్యపోతూ కళ్లు పెద్దవి చేసి చూస్తూ ఉండిపోయారు.

“పదండెహె లోపలకి!” అంటూ కొందరు ముందుకు తోసుకువచ్చారు.

సింహద్వారం కాపలా కాస్తున్న రాజభటులు చేతనున్న యీటెలు అడ్డం పెట్టారు.

పహరావాళ్ల యీ అడ్డంకిని గొల్లలు లక్ష్యపెట్టలేదు సరికదా, కయ్యానికి కాలు దువ్వినట్టు “ఎవర్రా మీరు? మాకే అడ్డంగా నిలుస్తారా?” అంటూ చేపాటి కర్రలు పైకెత్తారు.

“ఎవరు మీరు? ఇది రాజసదనం. ఇక్కడికిలా ఎవరు పడితే వాళ్లు లోపలికి దూసుకుపోకూడదు. ప్రాణానికే ప్రమాదం” హెచ్చరించాడొక భటుడు.

గొల్లలంతా ఒక్కపెట్టున నవ్వారు.

పహరావాడు ఇది చూసి బిక్కముఖం పెట్టూ “ఇక్కడ మేం ఉన్నదే మీలాంటి అడ్డమైన వారినీ లోపలికి వెళ్లకుండా అడ్డు తగలడానికేనయ్యా! వెళ్లండి. వెనక్కి మళ్లండి” హెచ్చరించారు.

“మీ అరాచకం ఇక్కడ సహించరు. తెలుసుకోండి” ఒక కావలివాడు అరిచాడు.

“ఎట్టెట్టా? మేం ఎవరం అనుకుంటున్నారు? మేం కృష్ణుని నేస్తాలం. వ్రేపల్లె నుంచి అతన్ని చూడవచ్చిన మిత్రులం. మా కృష్ణయ్యను చూడ్డానికి వీలులేదనడానికి మీరెవరు?” ముందుకు తోసుకు పోబోతూ చెప్పాడొకడు.

“అంత మాత్రం చేత? ఇలా దూరిపోవాలనే? చూస్తూ వూరుకుంటామనే? తెలియక వస్తే వచ్చారు. ఇక గొడవ చెయ్యక వెనక్కి వెళ్లండి. మర్యాదగా చెప్తే వినకపోతే మా యీటెలు మాట్లాడవలసివస్తుంది. జాగ్రత్త” హెచ్చరించారు కావలివాళ్లు.

“మేం వూరుకుంటామా? మా కర్రలు లేస్తాయి. మీ బుర్రలు పగులుతాయి. ఎవరడ్డుకుంటారో మేమూ చూస్తాం. పదండ్రా ముందుకి పదండి!” అంటూ బలంగా నెట్టుకురావడంతో పహరావాళ్లు యిక చేసేది లేక యీటెలు అడ్డుపెట్టి వారిని వెనక్కి నెట్టడం ప్రారంభించారు.

ఇది చూసిన లోని భటులు కొందరు కత్తులు తీసి డాళ్లు పట్టుకు, పహరా వాళ్లకి సాయంగా ముందుకి వురికారు.

“ఆఁ! కృష్ణయ్య నేస్తగాళ్లం - మాకే కత్తులు చూపించి బెదిరిస్తారా? ఈ కర్రలు చూడండి. మీ కత్తులు వాటి ముందు బలాదూరు!” అంటూ భటులతో కలియపడడానికి సిద్ధపడ్డారు.

“కర్రలు దించండి. మాలో ఏ ఒక్కరి మీద దెబ్బ పడినా మీ పుచ్చెలు ఎగిరిపోతాయి. జాగ్రత్త!” అంటూ ఒకడు అరిచాడు.

నిర్లక్ష్యంగా గొల్లున నవ్వి “అదీ చూద్దాంరా!” అరిచారు గొల్లలు.

ఊరేగింపుగా వస్తున్న యీ యాదవబృందంలో ఉన్న డప్పు వాద్యగాళ్లు నడక మార్చి యుద్ధపువరసలు మ్రోగించడం ప్రారంభించారు. ఇది విని అతి ఉత్సాహంగా కర్రసాము ప్రారంభించారు. భటుల ఒంటిమీద దెబ్బ పడకుండానే వాళ్లని దరి చేరనీయడం లేదు.

వారిలో ఓ పెద్ద “ఆపండి - సింహద్వారం ముందు యీ చిందులేమిటి? పెద్దలు వచ్చే సమయం అవుతోంది. ఇక్కడి నుంచి వెళ్లండి” అని హెచ్చరించాడు.

అయినా యాదవులు లక్ష్యపెట్టలేదు. కర్రలు తిప్పుతూనే ఉన్నారు.

పహరావాళ్లు వారిని బలవంతంగా ఆపడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. “కర్మరా, కత్తికొక్కణ్నిగా నరికిపారేస్తే పోయేది! కాని వాళ్లు వ్రేపల్లె అంటున్నారు. కృష్ణయ్య అంటున్నారు. చెలికాళ్లం అంటున్నారు. ఏం గొడవొస్తుందోనని వెనకతీస్తున్నాం” అంటూ అసహనం ప్రదర్శించారు. చేతులూ-చేతులూ; కర్రలూ-యీటెలూ కలియబడడానికి సిద్ధంగా ఉన్న తరుణంలో...

ఎక్కడి నుంచో లీలగా గాలిలో వేణుగానం తేలి వచ్చింది.

విభ్రాంతికి లోనైనట్టుగా అచేతనంగా యాదవులు బొమ్మల్లాగా నిలబడిపోయారు.

"కృష్ణయ్య" "కృష్ణయ్య..." అంటూ నమ్మలేనట్టుగా రహస్యం చెప్తున్నట్టు... అనుకోవడం ప్రారంభించారు.

భటులు యీటెలూ, కత్తులూ దించారు. యాదవులు కర్రలు దించారు. డప్పుల వాద్యఘోష టక్కున ఆగింది.

చేష్టలుడిగి నిలబడిన వారి దిశగా సాగి వస్తూ కృష్ణుడు చిరునవ్వుతో నిలిచాడు. సభకు సిద్ధమై వున్నాడేమో – సర్వాలంకారశోభితుడై కన్నుల పండుగ చేస్తున్నదతని దివ్యమంగళవిగ్రహం. మెడలో కౌస్తుభాన్ని దోబూచులాడిస్తూంది. కంఠాన్ని అలంకరించిన తులసిమాల. అతన్ని నఖశిఖపర్యంతం చూస్తూ నిలబడిపోయారు యాదవులంతా.

కృష్ణుడు వారిని సమీపించడానికి ఆత్రపడుతున్నట్లు పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ వచ్చాడు. వస్తూనే "ఎన్నాళ్లకెన్నాళ్లకీ? గదా! సాంబా... అందరూ, అందరూ వచ్చారా? ఎంత సంతోషం!" అంటూ ఒకరిద్దరిని గాఢంగా కౌగలించుకున్నాడు. అతని కళ్లు ఆనందబాష్పాలతో నిండి మెరుస్తున్నాయి. నోట మాట రావడం లేదు.

"అవును కృష్ణయ్యా! మథురలో లేవని తెలిసింది. ఈ ద్వారక కోటకి బయలుదేరాం అందుకే..."

అతని మాటకి అడ్డు తగులుతూ, "ఎంత శ్రమ పడ్డారయ్యా నా కోసం...? రండి..." అంటూ ఆప్యాయంగా చేయి పట్టి లోపలికి దారితీశాడు కృష్ణుడు.

"ఈ కత్తులవాళ్లూ – యీటెలవాళ్లూ, కస్సుబుస్సులూ... భయం వేసిందయ్యా!" అన్నాడొకడు అమాయకంగా.

"చెలికాడా, వారి విధి వారు నిర్వహించారంతే. మీరు నా మిత్రులని వారికి తెలియదు కదా!" అంటూ కృష్ణుడు దారి తీయగా రెట్టించిన ఉత్సాహంతో డప్పులు వాయిస్తూ, చిందులు వేస్తూ, అంతా అతని వెంట రాజప్రాసాదంలోకి నడిచారు.

అప్పటిదాకా తాము చూస్తున్నదేమిటో అర్థంకాని అయోమయంలో పడిన పహారావాళ్లు, భటులు తెప్పరిల్లి, "ప్రభువుల బాల్యస్నేహితులా వాళ్లు! ఎంత అమాయకంగా ఉన్నారు! రాచమర్యాదలు బొత్తిగా తెలియని వెర్రిబాగులవాళ్లు! స్వామికి వీరంటే ఇంత ప్రేమా?" అని ఒకరికొకరు చెప్పుకుంటూ, వారి వారి స్థానాల్లో విధులు నిర్వహించడానికి తిరిగి కుదురుకున్నారు.

కృష్ణుడు ముందుకు సాగుతుండగా యాదవ బృందం అతని వెంట సాగి చిత్రశాల వెలుపల ఆగారు.

"ఏం ఆగిపోయారు? లోపలికి రండి. ఇది మీ వంటి నా ఆత్మీయులు విశ్రాంతి తీసుకుందుకు ఏర్పాటు చేసిన అతిథిగృహమే. రా సాంబా, రండి విశ్రాంతి తీసుకుందురుగాని" అన్నాడు ఆప్యాయంగా కృష్ణుడు.

"అయ్యబాబోయ్. మాకీ రాచమర్యాదలెందుకయ్యా? పల్లెవాళ్లుండ గలరా? ఇలా హాయిగా ఆరుబయట సేదతీరుతాం గదా!" అన్నాడు సాంబుడు.

ఈలోగా లోపల ఏముందున్న కుతూహలంతో కొందరు యాదవులు కిటికీలలోంచి లోపలికి చూడడం ప్రారంభించారు. పదేపదే ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ ఒకరికొకరు కనబడ్డ దృశ్యాల గురించి చెప్పుకొస్తున్నారు.

"అన్నాయ్. ఓరన్నోయ్. లోన గోడలమీది బొమ్మలు చూశావా? అన్నీ కృష్ణయ్య చిన్ననాటి లీలలే!"

ఒకరికొకరు తోసుకుంటూ యింకొందరు చూడడానికి ప్రయత్నించారు. కళ్లకు కట్టినట్టున్న పూతనసంహారం, గంధర్వశాప విమోచనం, కాళీయ మర్దనం, గోపికావస్త్రాపహరణం కన్నులకు పండుగ చేస్తున్నాయి. ఆయా దృశ్యాల్లో తిరిగి జీవం పోదిగినట్టుగా ఉంది. ఆ అమాయకులకి, ఆనాటి వాటిని జ్ఞాపకం చేసుకుంటూ, వింతపడ నారంభించారు.

యాదవులను లోనికి తీసుకువెళ్లాడు కృష్ణుడు. కుడ్యచిత్రాలను చూపిస్తూ "జ్ఞాపకం ఉందా?" అంటూ అడుగుతున్నవాడల్లా రాసలీల దృశ్యం చూస్తూ అవాక్కయి నిలిచాడు. దానివంక కన్నార్పక చూస్తుంటే గదుడు, "కృష్ణయ్యా!" అన్నాడు.

ఆ పిలుపు వినబడలేదు.

సాంబుడు గట్టిగా "ఏమిటయ్యా! యీలోకంలో ఉన్నట్టు లేవే!" అన్నాడు.

ఉలిక్కిపడి వారి వంక చూస్తూ "నిజమే సాంబా! నేను యీ రాసలీల చిత్రాన్ని చూసినప్పుడల్లా ఏదో లోకానికి వెళ్లిపోతూ ఉంటాను" అన్నాడు కాస్త నిట్టూరుస్తూ.

సాంబుడు ఎంతో ఆప్యాయత ఉట్టిపడుతున్న కంఠస్వరంతో "ఏం కృష్ణా, రాధమ్మ గుర్తుకొస్తుందా?" అనడిగాడు.

కృష్ణుడు కాస్త నవ్వి "మరిచిపోతే కద గుర్తు రావడం? పాపం, ఎక్కడుందో ఎలా ఉందో – ఆ చిన్నది?" అన్నాడు.

"కృష్ణయ్యా, నువ్వు మధురకు వెళ్లిపోయాక మాకామె మళ్లీ కనబడలేదు. మాకు నీ మురళీ వినబడలేదు.." నిట్టూర్చాడు సాంబుడు.

కృష్ణుడు ఏదో బదులు చెప్పబోతుండగా ఇద్దరు భటులు లోనికి వచ్చారు.

వారిని చూసి "ఏమిటి?" అన్నట్టు ఆగాడు కృష్ణుడు.

"క్షమించాలి ప్రభూ! అన్నగారు వేంచేస్తున్నారు" అని వినయంగా తెలియచేశాడు.

వారి మాట పూర్తి కాకుండానే బలరాముడు లోపలికి ప్రవేశించాడు. "కృష్ణా, వ్రేపల్లె నుండి మన గోపకులు వచ్చారన్నమాట. వాద్యఘోష వినగానే నేను అనుకున్నానులే. అందుకే నేనూ పరుగుపరుగున ఇక్కడికి వచ్చానయ్యా!" అంటూ అందరినీ కలియచూశాడు.

యాదవుల ముఖాలు సంతోషంతో విచ్చుకున్నాయి.

వారిని చూస్తూ "ఏం గదా, సాంబా, పెద్దయ్యా, చినబాబూ, చిట్టి అంతా బాగున్నారా? ఇన్నాళ్లకి నేనూ కృష్ణయ్య మీకు జ్ఞాపకం వచ్చామా?" కాస్త నిష్ఠూరంగా అన్నాడు బలరాముడు, చిన్నగా నవ్వుతూనే.

"చాలు చాల్లే రామన్నా, మీకేం, మీరు బొమ్మలు గీయించుకుని సరదాలు నెమరువేసుకుంటూ హాయిగా ఉన్నారు. మేం పాటలు కట్టుకు పాడుకోగలమే గాని... రూపం చూడలేం కదా! మా మనస్సు ఎప్పుడూ మీకోసం అశ్రులు చాస్తూనే ఉందయ్యా. మీరే మమ్మల్ని మరిచిపోయారు. మా తీపి స్నేహం మీ దృష్టిలో మసకబారింది. అవునా, కృష్ణా?" సాంబుడు అడిగాడు.

కృష్ణుడు అతని భుజం చుట్టూ ఆప్యాయంగా చేయి వేసి, "సాంబా, మేం వ్రేపల్లె మరవడమా? అది సాధ్యమా? మనసూ, శరీరం ప్రశాంతతతో తృప్తితో నిండిపోయిన చోటు కదా అది! ఇక్కడేముందయ్యా... రాజకీయం తప్పించి! ఇక్కడ మనస్సుకి విశ్రాంతి యిచ్చేది, యిదిగో యీ చిత్రశాలే! ఏం అన్నయ్యా నిజమే కదూ?" బలరామునికేసి చూసి అన్నాడు.

"అవును సాంబా, మేం వ్రేపల్లెనీ, మిమ్మల్నీ మరిచిపోవడం, మమ్మల్ని మేం మరిచిపోవడంలాంటిదే కదా? మీరైనా రావచ్చు కదా, మాకు రాచకార్యాలతో తీరికలేకపోయినప్పుడు..." కాస్త నిష్ఠూరంగా ధ్వనించాడు బలరాముడు.

"బాగు బాగు. పిలవని పేరంటంగా వచ్చి యిక్కడ కూర్చోమంటావా? ఏదో కాస్త పప్పన్నం పెడతాం రండిరా, అంటే ఉరకేసుకుంటూ రామా? చెప్పు" అన్న సాంబని మాటకి యాదవులంతా లయ కలుపుతూ "అవునయ్యా, మాకు పప్పన్నం ఎప్పుడు పెడతారు? కృష్ణయ్య పెళ్లికి కదలిరామా? చెప్పండి" అన్నారు నవ్వేస్తూ.

బలరాముడు, కృష్ణుని వంక కొంటెగా చూస్తూ, "ఏం తమ్ముడూ! వారి కోరిక ఎప్పుడు తీరుస్తావు? వారికి విందు భోజనం ఎప్పుడు పెడతావు?

అడుగుతున్నారుగా చెప్పు" అన్నాడు. "ఇంక ఆలస్యం దేనికి? నువ్వు వెంటనే వివాహానికి సిద్ధం కావాలి. మనవారి కోరికలు తీర్చాలి. ఏమంటావు?"

కృష్ణుడు కొంటెగా నవ్వేస్తూ "చిత్తం. అన్నగారి ఆజ్ఞ ఆశీర్వాదమే కదా! ఒకటేం భాగ్యం. నా మిత్రులని పదే పదే విందుభోజనాలకి పిలవనా? చిన్న చిక్కుంది" అన్నాడు సాలోచనగా.

"చిక్కా, చిన్న చిక్కా? ఏమిటయ్యా అది?" కుతూహలంగా బలరాముడు అడిగాడు.

"ముందు జేష్ఠులు వివాహం చేసుకోవాలి కదా!"

గట్టిగా నవ్వేస్తూ "జేష్ఠుని పెండ్లా? మరిచిపోయావా? నా వివాహం ఏనాడో జరిగింది కదయ్యా! మీ వదిన రేవతిని మరిచావా? ఆమె మన యింట అడుగుపెట్టి ఎన్నాళ్లో అయింది కదయ్యా?" అన్నాడు.

కృష్ణుడు నవ్వి "నేను మా వదినను మరువడమేమిటి? ఆమె వునికే కద మన జీవగర్ర! అన్నయ్యా, నేను అంటున్న అగ్రజుడు మన సహపాఠి సుదాముడు. మన మిత్రుడూ, ఆత్మీయుడూ, విద్వత్సంపన్నుడూ, శోత్రియుడూ అయిన సుదాముడు నాకంటే పెద్దవాడు. అతడింకా బ్రహ్మచారిగా మిగిలివున్నాడు. గుర్తు చేస్తున్నాను" అన్నాడు నవ్వుతూ.

"ఓరి ఓరి, ఆ పేద బాపనయ్యతో నీకు సాటేమిటి కృష్ణయ్యా? నీవెక్కడ, ఆ బక్క బ్రాహ్మడెక్కడ?" అన్నాడు సాంబుడు.

"అతని పెళ్లితో నీ పెళ్లి ముడిపెట్టుకోవడం ఏం బాగాలేదయ్యా!" నొచ్చుకున్నాడు గదుడు.

బలరాముడు కాస్త ఆశ్చర్యం ప్రకటిస్తూ "కృష్ణా, మన సుదాముడా? ఇంకా ఓ యింటివాడు కాలేదా? బాగుంది!" నవ్వాడు.

"ఈ కృష్ణయ్యతో అన్నీ మడత పేచీలే రామన్నా. మరి ఆ బాపడు ఓ చిన్నదాని మెడలో సత్వరంగా ఆ మూడుముళ్లూ వేసేలా చేసే బాధ్యత కూడా మనం యీ కృష్ణయ్య మీదే పెట్టేద్దాం". ఈ మాటకి అంతా నవ్వారు.

“తథాస్తు! మిత్రులారా, ఈరోజే సుదాముని ఉనికిని కనిపెట్టమని నేను చారులను పంపిస్తాను లెండి. మీరు హాయిగా ఇక్కడ గడపండి. నాకు రాచకార్యాలున్నాయి. వస్తా” నంటూ బలరాముడు దర్బారువైపు నడిచాడు.

* * *

అగ్రహారపు మట్టిమార్గం ఎండలో చుర్రుమంటూంది. బ్రాహ్మణాగ్రహార మేమో, భోజన సమయం దాకా ఎత్తయిన అరుగులమీద కూర్చుని వేదాధ్యయం సాగిస్తూనే జంధ్యాలు వడుక్కుంటున్నారు బ్రాహ్మలు.

ఇళ్ల కప్పులపైన సన్నగా పొగలు విస్తరించి ఆ ఎండలో కూడా స్పష్టంగా సుళ్లు తిరుగుతూ కన్పిస్తున్నాయి. రహస్యవిషయాలు కాస్త గుసగుసలాడుకుంటున్నట్టు మాట్లాడుకుంటున్నారు.

అందరి కుతూహలం రత్నాకర చయనులు కుమార్తె వివాహం గురించే. ఆ అగ్రహారంలో ఆమె జాతకం పరిశీలించని వాడూ లేడు, పెదవి విరవనివాడు లేడు! “కాళ్లకి బలపాలు కట్టుకు తిరిగితే మాత్రం ఆ జాతకానికి కల్యాణం – అహఁ దుర్లభం!” అంటూ వాదించుకుంటూ, దూరంలో రత్నాకర చయనులూ, అతని కుమారుడు సాగరశర్మా కనిపించి, “ఆగండాగండి! తండ్రీ, కొడుకూ డీలాపడి వస్తున్నారు. పాపం మళ్లీ సంబంధం చూశారో ఏమో?” కాస్త వెటకారంగా అన్నాడొకడు.

కానీ వారు ఎదురుచూసినట్టు తండ్రీ, కొడుకూ యీ వీథికి రాలేదు. పక్క వీథికి మళ్లారు.

“మనం ఉన్నామనేమో?” అన్నాడొకడు.

“వీళ్లకోసం మనం అగ్రహారం వదులుతామా ఏమిటి?” వెకిలిగా నవ్వాడింకోడు.

చిన్న తాటాకు గొడుగు నీడన చకచక నడుస్తూ వస్తున్నాడు సుదాముడు. శాంతిశ్లోకం చదువుకుంటూ అటూ ఇటూ చూడకుండా వస్తున్నాడు. మరీ నడినెత్తికి సూర్యుడు రాకుండా ఓ గుడో, సత్రమో చూసుకుని అరుగుమీదకి చేరాలని అతని తొందర.

"పూర్ణమదః పూర్ణ మిదం, పూర్ణాత్పూర్ణ మిద్యతే, పూర్ణస్య, పూర్ణమాదాయ పూర్ణ మేవా వశిష్యతే" అంటూ గంభీరమైన కంఠంతో శ్రావ్యంగా చదువుకుంటూ నడుస్తున్నాడు.

అతన్ని చూసిన ఒకరిద్దరు, "చక్కని బ్రహ్మచారిలా వున్నాడు. ఎటు వెడుతున్నాడో?" అనుకోకపోలేదు.

ఒక సత్రం అరుగుమీద కూర్చున్న రత్నాకరచయనులూ, సాగరశర్మా, కాస్త దూరం నుంచే వస్తున్న సుదాముని చూశారు. "నాన్నా, ఎవరో కొత్తవారు. పలకరిద్దామా? బ్రహ్మచారేమో... సోదరిని చేపడతాడేమో అడుగుదామా?" ఆశగా అన్నాడు సాగరశర్మ.

సుదామునికి ఎదురువెళ్లి నమస్కరించారు. పలకరింపుగా "నమస్కారం! అగ్రహారానికి కొత్తవారు కాబోలు!" అన్నాడు సాగరశర్మ.,

"రాధేశ్యాం! రాధేశ్యాం! నిజం, కొత్తవాడినే. ఎండకి కాస్త తలదాచుకొందుకో అరుగు కోసం చూస్తూ వున్నాను!" అన్నాడు, వారిని సూటిగా చూస్తూ. వారు పనిమీద వెడుతున్నారని అనిపించింది. నొచ్చుకుని "క్షమించండి. మీరు కార్యార్థులై వెడుతున్నట్టుంది. ఒంటి బ్రాహ్మణ్ణి, ఎదురొచ్చాను. అపశకునం" నొచ్చుకున్నాడు సుదాముడు.

"అదేం కాదు. మేం కార్యార్థులమే గాని యిప్పుడేపనిమీదా బయలుదేరలేదు. నమ్మండి" నమ్మపలికాడు రత్నాకరచయనులు.

"అయినా సరే. మీరు తిరిగి యింట్లోకి వెళ్లి పాదప్రక్షాళనం చేసుకుని క్షణం విశ్రమించి, తిరిగి వెళ్లండి. మీ కార్యం సానుకూలం అవుతుంది" నొక్కి చెప్పాడు సుదాముడు.

"అయ్యా, మా కార్యం సగం సానుకూలమైనట్టే లెక్క. మీరు ఒంటి బ్రాహ్మణులే కాని ఒంటిపోచవారు! బ్రహ్మచారులు. నా సోదరి వామాక్షికి తగిన వరుల వలె నా కళ్లకు కనిపిస్తున్నారు" చిరునవ్వు నవ్వి సాగరశర్మ అన్నాడు.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Krishnarpanam**

* * *